




RNI : APBIL/2023/86665

# రాయల్ జర్నలిజం

నిజానికి రాయల్ స్వరం

ద్వి భాషా దినపత్రిక


ROYAL JOURNALISM

గుంటూరు, సంపుటి : 03 సంచిక : 153 | మంగళవారం 10 - 2 - 2026 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | పేజీలు : 8 వెల : రూ.2-00

GUNTUR VOL-03 ISSUE - 153 CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO 10 TUESDAY february 2026 PAGES : 8 Rs :2-00


# క్షేత్రస్థాయిలో పర్యటించండి... విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు: సీఎం చంద్రబాబు

- వేసవిలో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశం: హాస్టల్ విద్యార్థుల ఆరోగ్యంపై కీలక వ్యాఖ్యలు... అధికారులదే బాధ్యత అని హెచ్చరిక
- క్షేత్రస్థాయిలో పర్యటించి పాలన అమలును పరిశీలించాలని మంత్రులకు సూచన: గత ప్రభుత్వ అప్పుల వల్ల అధిక వడ్డీలు చెల్లిస్తున్నామని వెల్లడి
- త్వరలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ తీసుకురానున్నట్లు ప్రకటన



అమరావతి: వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ఇప్పటి నుంచే పటిష్టమైన చర్యలు చేపట్టాలని, హాస్టళ్లలో విద్యార్థులు అనారోగ్యం పాలైతే సంబంధిత జిల్లా కలెక్టర్లు, మంత్రులనే బాధ్యుల్ని చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గట్టిగా హెచ్చరించారు. ప్రభుత్వ పాలసీలు క్షేత్రస్థాయిలో ఎలా అమలవుతున్నాయో తెలుసుకునేందుకు మంత్రులు, కార్యదర్శులు తప్పనిసరిగా క్షేత్రస్థాయి పర్యటనలు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పాలసీలు సమర్థవంతంగా అమలైతేనే ఆశించిన ఫలితాలు వస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. సోమవారం అమరావతి సచివాలయంలో మంత్రులు, కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వ తప్పిదాల వల్ల రాష్ట్రం 14 శాతం అధిక వడ్డీతో అప్పులు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక క్రమశిక్షణను గాడిలో పెట్టి, రాష్ట్ర క్రెడిట్ రేటింగ్ పెంచడం ద్వారా వడ్డీ భారాన్ని తగ్గించుకునేందుకు రుణాలను రీషెడ్యూల్ చేస్తున్నామని వివరించారు. ప్రతి ఐదేళ్లకు జీఎస్‌డీపీ, తలసరి ఆదాయం రెట్టింపు కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

**ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి**

ఆరోగ్య రంగంపై ప్రత్యేక దృష్టి సారించాలని సీఎం సూచించారు. జూలై నాటికి 66 లక్షల హైరిస్క్ కేసులకు హెల్త్ స్క్రీనింగ్ పూర్తి చేయాలని, 5 లక్షల మంది హాస్టల్ విద్యార్థుల ఆరోగ్య పరీక్షలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశించారు. గర్భిణుల్లో సిజేరియన్లు తగ్గించి, సాధారణ ప్రసవాలు పెరిగేలా అవగాహన కల్పించాలన్నారు. మాతాశిశు సంరక్షణ కోసం 'కేర్ అండ్ గ్రో' కార్యక్రమాన్ని, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందించాలని చెప్పారు. రాష్ట్ర జనాభా నిర్వహణ కోసం మార్చి నాటికి 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ' తీసుకురానున్నట్లు సీఎం వెల్లడించారు. విద్యారంగంలో ఒత్తిడి లేని విద్యావిధానం అమలు చేయాలని, పదో తరగతి ఫలితాల్లో మెరుగుదలకు 100 రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల ఆత్మహత్యలు జరగకూడదని, నూతన ఆవిష్కరణలకు స్వేచ్ఛాయుత వాతావరణం ఉండాలని అభిప్రాయపడ్డారు.

**నీటి సంరక్షణ, అభివృద్ధిపై కీలక సూచనలు**

రాష్ట్రంలోని 38 వేలకు పైగా ఉన్న చిన్న నీటిపారుదల చెరువులను పరిరక్షించాలని, భూగర్భ జలాలను 'నీటి బ్యాంకు' తరహాలో వాడాలని సూచించారు. పారిశ్రామిక కాలుష్యంతో జలాలు కలుషితం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అల్లూరి జిల్లా లంబసింగిలో కుంకుమ పువ్వు సాగు, ఏలూరు సమీపంలో కోకో సిటీ ఏర్పాటు వంటి వినూత్న ప్రాజెక్టులకు అవకాశాలున్నాయని, వీటిని ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఇతర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## 37 ఏళ్ల సంప్రదాయాన్ని పక్కన పెట్టిన ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ



న్యూఢిల్లీ : ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ 37 ఏళ్ల సంప్రదాయాన్ని బద్దలు కొట్టారు. 1989 నుంచి ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 8న వైమానికదళ అధికారులతో జరుగుతున్న సమావేశానికి ఈసారి హాజరు కాలేదు. ఇరాన్ ఇంటర్నేషనల్ రిపోర్ట్ ప్రకారం, ఈ సమావేశం 1979 ఫిబ్రవరి 8న వైమానిక దళ అధికారులు రూహుల్లా ఖమేనీకి విధేయత చూపిన రోజును గుర్తుచేస్తుంది. కోవిడ్ సమయంలో కూడా ఖమేనీ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈసారి ఆర్మ్డ్ ఫోర్సెస్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ అబ్దోల్రహీం మౌసవి వైమానిక దళ అధికారులతో సమావేశమయ్యారు. అమెరికాతో విభేదాలు ముదిరిన నేపథ్యంలో, భద్రతా కారణాల రీత్యా ఈ కార్యక్రమానికి ఖమేనీ దూరంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. యూఎస్ నిమిట్జ్-క్లాస్ ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ యూఎస్ఎస్ అబ్రహం లింకన్ అరేబియన్ సముద్రంలో ఉంది. జోర్డాన్‌లోని మువఫ్ఫక్ సల్తి ఎయిర్ బేస్‌కు డజన్ల కొద్దీ ఎఫ్-15 ఫైటర్ జెట్లు, ఎంక్యూ-9 రీపర్ డ్రోన్, ఎ-10సి థండర్‌బోల్ట్ ×× గ్రౌండ్ అటాక్ ఎయిర్‌క్రాఫ్ట్ చేరాయి. రెడ్ సీలో యూఎస్ డిస్ట్రాయర్ యూఎస్ఎస్ డెల్బర్ట్ డి బ్లాక్, గల్ఫ్‌లో ఎంక్యూ-4సి ట్రైటన్ సర్వైలెన్స్ డ్రోన్ కూడా కనిపించాయి. ఈ పరిణామాల నేపథ్యంలో, ట్రంప్ ఇరాన్‌పై దాడి చేసే అవకాశం ఉందని భయాలు వ్యక్తమవుతున్నాయి.

## క్షేత్రస్థాయిలో ఉదాసీనత పనికిరాదు




- ఎవరి బాధ్యతలు వారు సక్రమంగా నిర్వహించాలి
- అప్పుడే ఆశించిన ఫలితాలను సాధిస్తాం
- అధికారులకు డిప్యూటీ సీఎం పవన్ కీలక సూచనలు

అమరావతి: క్షేత్రస్థాయిలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరించవద్దని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులకు సూచించారు. క్షేత్రస్థాయి నుంచి పైస్థాయి అధికారి వరకు ఎవరికి వారు సక్రమంగా బాధ్యతలు నిర్వర్తించాల్సిందేనని చెప్పారు. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన వివిధ శాఖల కార్యదర్శులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో పవన్ పాల్గొని మాట్లాడారు. తాము నాలుగు గోడల మధ్య కూర్చునే వ్యక్తులం కాదని పవన్ అన్నారు. అంతా అద్భుతంగా ఉందని చెబుతున్నా.. కొన్నిచోట్ల గ్యాప్స్ ఉన్నాయని వ్యాఖ్యానించారు. అనుకున్న లక్ష్యాలను నిర్దేశించుకున్న సమయానికి పూర్తిచేయాలని తేల్చిచెప్పారు. పాలసీలను అమలు చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నా మన్నారు. పల్లెపండుగకు రూ.2,500 కోట్లు, అడవితల్లి బాటకు రూ.1,005 కోట్లు మంజూరు చేశామని చెప్పారు. వివిధ పథకాలకు రూ.11,328 కోట్లు మంజూరు అయ్యాయని వివరించారు. జల్‌జీవన్ మిషన్‌కు రూ.25వేల కోట్ల మొబిలైజేషన్ చేశామన్నారు. ఇప్పటికే దాదాపు రూ.10వేల కోట్ల పనులు ప్రారంభ మయ్యాయని పవన్ తెలిపారు. ఉన్న తక్కువ వనరులను ఉపయోగించుకొని ఎక్కువ కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. ప్రధాని సహాయ సహకారాలు, ముఖ్యమంత్రి అనుభవం ఎంతో ఉపయోగ పడుతుందని వెల్లడించారు. ప్రతి రూపాయి క్షేత్రస్థాయిలో కనిపించాలని... ప్రాజెక్టులు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. క్షేత్ర స్థాయిలో ఉదాసీనత ఉంటుందన్నారు డిప్యూటీ సీఎం. ముఖ్యమంత్రి ఇచ్చిన టార్గెట్‌లు రీచ్ కావలంటే చాలా వరకూ ఎక్స్యూజెస్ కనిపిస్తున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి, తాను అకౌం టబిలిటీ ఫిక్స్ చేసుకుంటున్నామని.. అందుకే క్షేత్ర స్థాయిలో ఫలితాలు రావాలని కోరుతున్నామని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగుతున్న ఈ సమావేశంలో జీఎస్డీపీ వృద్ధి రేటు, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల సాధన కోసం పది సూత్రాల అమలు, ఆదాయార్జన శాఖల పురోగతిపై సమీక్షించారు. 2026-27లో కేంద్ర ప్రాయోజిత పథకాల కార్యాచరణపై దిశానిర్దేశర చేసారు.

## అంబటి రాంబాబుకు రెండో షాక్...

### మరో కేసులో రిమాండ్ విధించిన కోర్టు



అమరావతి:ఇప్పటికే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబును దుర్భాషలాడిన కేసులో రిమాండ్ లో ఉన్న వైసీపీ సీనియర్ నేత అంబటి రాంబాబుకు మరో కేసులో షాక్ తగిలింది. మెడికల్ కాలేజీని పీపీపీ విధానంలో నిర్వహించడాన్ని వ్యతిరేకిస్తూ చేసిన ఆందోళన కార్యక్రమం సందర్భంగా... బ్యారికేడ్లను తోసివేసి, పోలీసు విధులకు ఆటంకం కలిగించారనే కేసులో ఆయనకు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ నెల 22వ తేదీ వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మరోవైపు, చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యల కేసులో అంబటి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్ పై గుంటూరు మొబైల్ కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ విచారణ అనంతరం ఆయనను తిరిగి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించనున్నారు.

## పంజాబ్ సీఎం విదేశీ పర్యటనకు అనుమతినివ్వని కేంద్రం



న్యూఢిల్లీ :పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ విదేశీ పర్యటనపై కేంద్ర ప్రభుత్వం మరోసారి నీళ్లు చల్లింది. యూరప్ లో పర్యటించేందుకు మాన్ విదేశాంగ శాఖ అనుమతి కోరగా తిరస్కరించింది. దీంతో ముఖ్యమంత్రి మాన్ పర్యటన అర్ధాంతరంగా రద్దయింది. ఇటీవల మాన్ విదేశీ పర్యటనలకు అనుమతి నిరాకరించడం ఇది వరుసగా మూడోసారి కావడం గమ నార్హం. పంజాబ్ ప్రభుత్వం వచ్చే నెలలో నిర్వహించ తలపెట్టిన 'ఇన్వెస్టర్స్ సమ్మిట్' కోసం పెట్టుబడులను ఆహ్వానించడానికి భగవంత్ మాన్ చెక్ రిపబ్లిక్ మరియు నెదర్లాండ్స్‌లో పర్యటించాల్సి ఉంది. పారిశ్రామికాభివృద్ధి, విద్య, మరియు విదేశీ పంజాబీల సహకారం కోసమే ఈ పర్యటన ఖరారైంది. అయితే కేంద్రం నుంచి క్లియరెన్స్ రాకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వ ప్రయత్నాలకు బ్రేక్ పడింది.

**వివాదాస్పదంగా 'పొలిటికల్ క్లియరెన్స్'**

రాష్ట్రాల ముఖ్యమంత్రులు విదేశాల్లో పర్యటించేందుకు విదేశాంగ శాఖ అనుమతి తీసుకోవడం తప్పనిసరి. దీనినే పొలిటికల్ క్లియరెన్స్ గా వ్యవహరిస్తారు. అయితే, ఈ నిబంధన చుట్టూ వివాదాలు ముసురుకుంటున్నాయి. పంజాబ్ విషయానికి వస్తే.. ముఖ్యమంత్రి భగవంత్ మాన్ పర్యటనలపై కేంద్రం వరుసగా ఆంక్షలు విధిస్తోంది. పొలిటికల్ క్లియరెన్స్ నిరాకరిస్తోంది. ఈ ఏడాది జనవరిలో యూకే మరియు ఇజ్రాయెల్ లో పర్యటించేందుకు మాన్ అనుమతి కోరగా నిరాకరించింది. గతంలో పారిస్ ఒలింపిక్స్ సందర్శనకూ ఇలాగే అడ్డుచెప్పడంతో ఆ పర్యటన రద్దయింది. తాజాగా చెక్ రిపబ్లిక్, నెదర్లాండ్స్ పర్యటనకూ మాన్ కు కేంద్రం అనుమతి ఇవ్వలేదు. అయితే, ఈ అనుమతిని నిరాకరించడానికి గల కారణాలను విదేశాంగ శాఖ బహిరంగంగా వెల్లడించలేదు. ఈ వ్యవహారం ఇప్పుడు కేంద్ర-రాష్ట్ర సంబంధాల మధ్య మరోసారి చిచ్చు రేపింది.

**కేంద్రంపై 'ఆప్' విమర్శ**

కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) తీవ్రంగా ఖండించింది. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల అభివృద్ధిని కేంద్రం ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటోందని ఆప్ నేతలు మండిపడుతున్నారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు విదేశాలకు వెళ్తున్నప్పుడు పంజాబ్ సీఎంకు మాత్రమే అనుమతి ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నిస్తున్నారు.

## తొలి ఎన్నికల బరిలో విజయ్.. రెండు నియోజకవర్గాల నుంచి పోటీ!



న్యూఢిల్లీ : నటుడు, తమిళగ వెట్రి కజగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ తన రాజకీయ అరంగేట్రానికి పక్కా ప్రణాళికతో సిద్ధమవుతున్నారు. రాబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. చెన్నైలోని విరుగంబాక్కం, మధ్య తమిళనాడులోని తిరుచ్చి తూర్పు స్థానాల నుంచి ఆయన బరిలోకి దిగనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇది పార్టీ విస్తరణతో పాటు వ్యవస్థాపకుడైన విజయ్‌కు బలమైన ఆరంభం ఇచ్చేందుకు రూపొందించిన వ్యూహమని టీవీకే నేతలు చెబుతున్నారు. చెన్నైలోని విరుగంబాక్కం నియోజకవర్గం పట్టణ ఓటర్లు, మొదటిసారి ఓటు వేయనున్న యువతలో విజయ్‌కు మంచి ప్రచారం కల్పిస్తుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు తిరుచ్చి తూర్పు నుంచి పోటీ చేయడం ద్వారా పార్టీ కేవలం చెన్నైకే పరిమితం కాదనే సంకేతాన్ని రాష్ట్రవ్యాప్తంగా పంపాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వాస్తవానికి వెలచ్చేరి, విక్రవాండి, నాగపట్టణం వంటి నియోజకవర్గాలను కూడా పరిశీలించినా, ఓటర్లతో ఉన్న పరిచయం, క్షేత్రస్థాయిలో పార్టీ సన్నద్ధత ఆధారంగా విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు స్థానాలను ఖరారు చేసినట్లు సమాచారం. విజయ్ తొలిసారి ఎన్నికల్లో పోటీ చేస్తుండటం, అధికార డీఎంకే బలంగా ఉండటంతో గెలుపు అవకాశాలను పెంచుకునేందుకే రెండు చోట్ల పోటీ చేయాలనే జాగ్రత్తతో కూడిన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విరుగంబాక్కం, తిరుచ్చి తూర్పు నియోజకవర్గాలకు డీఎంకే ఎమ్మెల్యేలు ఏ.ఎం.వి. ప్రభాకర రాజా, ఇనిగో ఎస్. ఇరుదయరాజ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో ఈ రెండు చోట్లా పోటీ ఆసక్తికరంగా మారనుంది. త్వరలోనే విజయ్ తన ప్రచార వ్యూహాలను ప్రకటించి, బహిరంగ సభలను ముమ్మరం చేయనున్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక - రెవెన్యూ క్లినిక్

రాయల్ జర్నలిజం ( ఒంగోలు) ఫిబ్రవరి 9:
"ప్రజా సమస్యల పరిష్కార వేదిక" లో అందిన అర్జీలకు నిర్ణీత గడువులోపు నాణ్యతతో పరిష్కారాన్ని చూపాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.ఒంగోలు కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం, పిజిఆర్ఎస్), రెవెన్యూ క్లినిక్ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్ రెడ్డి, కళావతి, విజయజ్యోతి, శ్రీమతి మాధురి లతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. వచ్చిన అర్జీలను ఆయా శాఖల అధికారులకు సూచిస్తూ సత్వరం పరిష్కరించేలా ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక మరియు రెవెన్యూ క్లీనిక్ ల ద్వారా వచ్చే అర్జీలను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా నాణ్యమైన పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు సవివరంగా వివరించాలన్నారు. ప్రజా సమస్య పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను బియాండ్ యస్.యల్.ఏ పోకుండా చూడాలని అధికారులకు సూచించారు.ఈ రోజు నిర్వహించిన "ప్రజా



సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమంలో మొత్తం 513 వినతులు రాగా అందులో రెవెన్యూ సంబంధిత అంశాలపై 358 వినతులు రావడం జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

రాయల్ జర్నలిజం ( ఒంగోలు) ఫిబ్రవరి 9:
జిల్లాలో తాగునీటికి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ పి.రాజాబాబు చెప్పారు. ముఖ్యంగా సురక్షితమైన నీటిని అందుబాటులో ఉంచడంపై దృష్టి పెట్టామన్నారు. సోమవారం అమరావతి సచివాలయ ంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంత్రులు, అన్ని శాఖల కార్యదర్శులతో ప్రత్యేక కాన్ఫరెన్స్ జరిగింది. ప్రకాశం భవనం నుంచి ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజుతో కలిసి కలెక్టర్ ఇందులో వీడియో కాన్ఫరెన్స ద్వారా పాల్గొన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణమే లక్ష్యంగా వివిధ అంశాలపై అధికార యంత్రాంగానికి ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. జి.ఎస్.డీ.పీ, స్వర్ణాంధ్ర ఏ 2047 పది సూత్రాలు, ఆదాయార్జన శాఖలు, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో పురోగతి - 2026-27 ఆర్థిక సంవత్సరానికి కార్యాచరణ ప్రణాళిక, రాష్ట్రంలో పెట్టుబడుల ప్రతిపాదనలు, ఆర్.టి.జి.ఎస్. - పరిపాలనలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, నైపుణ్య అభివృద్ధి - ఉపాధి కల్పన - ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, శాంతిభద్రతలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. వేసవిలో తాగునీటికి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లాల కలెక్టర్లకు స్పష్టం చేశారు. దీనిపై కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని తాగునీటి వనరులకు పరీక్షలు నిర్వహించి జియో ట్యాగింగ్ చేశామన్నారు. ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండి త్రాగటానికి అనువుగా లేని వాటిని ప్రజలు వినియోగించకుండా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని అవసరమైన మరమ్మతులు చేయించడంతోపాటు ట్యాంకర్ల ద్వారా కూడా సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ముఖ్యమంత్రికి చెప్పారు. కొండపి నియోజకవర్గంలో లేటు ఖరీఫ్ సీజన్ వలన పూర్తిస్థాయి వివరాలను నిర్దేశిత యాప్ లో నమోదు చేయలేకపోయామన్నారు. ఈ నెలాఖరుకు ఆ వివరాలను కూడా డేటా ఎంట్రీ చేస్తే కే.పీ.ఐ.లో జిల్లా ర్యాంకు మరింత మెరుగవుతుందని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# భయాన్ని జయించండి - మౌనాన్ని విరగదీయండి

## 'పెడల్ ఫర్ ఫ్రీడమ్' సైకిల్ యాత్రలో యువతకు ఏపీ ఈగల్ చీఫ్ ఐజీపీ ఆకే. రవికృష్ణ పిలుపు

రాయల్ జర్నలిజం (విజయవాడ) ఫిబ్రవరి 09 : సమాజంలో జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు చూసి మౌనంగా ఉండటం ఘోరమైన తప్పిదమని, యువత భయాన్ని జయించి ధైర్యంగా ముందుకు రావాల్సిన అవసరం ఉందని ఏపీ ఈగల్ విభాగాధిపతి శ్రీ ఆకే. రవికృష్ణ ఐపీఎస్ స్పష్టంచేశారు. కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, ఆంధ్రప్రదేశ్ మరియు రెడ్ రోప్ ఉద్యమం సంయుక్త ఆధ్వర్యంలో ఎస్.ఆర్.ఆర్ ఉ సి.విఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విజయవాడలో నిర్వహించిన 'పెడల్ ఫర్ ఫ్రీడమ్' సైకిల్ యాత్రలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఐజీపీ రవికృష్ణ మాట్లాడుతూ, యువతీ యువకుల్లో భయం చోటు చేసుకుంటే సమాజం నిర్వీర్యమవుతుందని అన్నారు. కవి రవీంద్రనాథ్ ఠాగూర్ గారి భయం లేని మనస్సు భావనను గుర్తు చేస్తూ, స్వేచ్ఛాయుత ఆలోచనలతో, ధైర్యంగా నిలబడే తరం అవసరమని చెప్పారు.ఇటీవల డ్రోన్ సహాయంతో గంజాయి వినియోగాన్ని గుర్తించి చర్యలు చేపట్టిన సంఘటనను ఉదాహరణగా ప్రస్తావిస్తూ, అసాంఘిక కార్యకలాపాల సమాచారం తెలిసినా భయంతో చెప్పకపోవడం వల్ల సమాజానికి తీరని నష్టం






జరుగుతోందని పేర్కొన్నారు."అన్యాయం కనిపిస్తే మౌనం పాపం; స్పందించడమే సామాజిక ధర్మం" అని ఆయన వ్యాఖ్యానించారు.మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా, విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే ఏపీ ఈగల్ విభాగం టోల్ ఫ్రీ సంఖ్య 1972 కు తెలియజేయాలని సూచించారు."మన మౌనమే మనకు శిక్షగా మారకూడదు" అని హెచ్చరించారు.తాను కూడా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినేనని గుర్తు చేసిన ఐజీపీ, ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులు కూడా పరిపాలనా, పోలీసు వంటి అత్యున్నత సేవలకు చేరుకోవచ్చని తెలిపారు. సరైన లక్ష్యం, క్రమశిక్షణ, నిరంతర తపన ఉంటే విజయం తప్పదని స్పష్టం చేశారు.సోక్రటీస్ కథను ఉదాహరణగా చెబుతూ, శ్వాస కోసం ఎంత తపన ఉంటుందో అదే స్థాయిలో లక్ష్య సాధనపై తపన ఉంటే ఎలాంటి విజయమైనా సాధ్యమని విద్యార్థులకు ప్రేరణనిచ్చారు.గురజాడ అప్పారావు "దేశం అంటే మట్టి కాదు -- దేశం అంటే మనుషులే"అనే మాటలను గుర్తు చేస్తూ యువత దేశం మరియు సమాజం పట్ల బాధ్యతతో మెలగాలని పిలుపునిచ్చారు.

# సంచార వైద్యశాల సేవలు ప్రారంభం

రాయల్ జర్నలిజం (రేపల్లె), ఫిబ్రవరి 09:
పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు సంచార పశువైద్యశాల వాహనాలను పట్టణంలోని టీడీపీ కార్యాలయ ఆవరణంలో రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశాల మేరకు టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు పశువైద్యసేవలు చేరువ చేసేందుకు సంచార పశువైద్యశాలలను ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. నిర్ణీత వారాలలో ఆయా గ్రామాలకు ఈ సంచార పశువైద్యశాలలు వెళ్ళి ఆయా గ్రామాలలోని పశువులకు వైద్యసేవలు అందించటం జరుగుతుందని, పశుపోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రేపల్లె, నిజాంపట్నం మండలాలకు ఒక వాహనం, నగరం, చెరుకుపల్లి మండలాలకు ఇంకొక వాహనం ద్వారా పశువైద్యులు వైద్యసేవలు అందిస్తారన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ బెల్లంకొండ నాంచారయ్య, వైద్యాధికారులు ప్రవీణ్‌కుమార్, హేమప్రియ, రంజిత, నాయకులు దండుప్రోలు పిచ్చియ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# సర్వజన ప్రభుత్వ వైద్యశాల ఒంగోలు నందు వైద్య పరీక్షలు -హజ్ యాత్ర



రాయల్ జర్నలిజం ( ఒంగోలు) ఫిబ్రవరి 9:
09.02.2026 న వైద్య ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ అంధ్రప్రదేశ్ మంగళగిరి వారి ఆదేశముల మేరకు ప్రకాశం జిల్లా ఒంగోలు కలెక్టర్ ఉత్తర్వుల మేరకు ప్రకాశం జిల్లా నుండి హజ్ యాత్రకు వెళ్ళు ప్రయాణికులకు సర్వజన ప్రభుత్వ వైద్యశాల ఒంగోలు నందు ది 09.02.2026 న వైద్య పరిక్షలు నిర్వహించి అర్హులైన వారందరికీ వ్యాక్సినేషన్ కార్యక్రమమును గౌరవనీయులైన దామచర్ల జనార్దన్ ఒంగోలు నియోజకవర్గ శాసనసభ్యులు వారి ఆధ్వర్యములో హజ్ యాత్రికులకు వేళ్ళు వారి కుటుంబసభ్యులకు భద్రత సూచనలు సలహాలు అందించడం జరిగినది హజ్ యాత్రకు వెళ్ళు సభ్యులు ప్రతిఒక్కరు ప్రభుత్వం వారు సూచించిన విధముగా వ్యాక్సినేషన్ తప్పనిసరిగా వేసుకొని వెళ్ళవలసినదిగా తెలియపరిచినారు . ప్రభుత్వము వారు నిర్దేశించిన ప్రకారము 60 మందికి వ్యాక్సినేషన్ నిర్వహించడ మైనది 60 మందిలో 24 మంది మహిళలు. 4 నలుగురు 65 పై బడిన వారికీ మీనింజోకాఖల్ మరియు ఇన్ఫుఎంజా వ్యాక్సిన్ ప్రభుత్వం వారు సూచించిన ప్రకారం వేయబడును 65 సంవత్సరాలు లోపు వయసు వారికీ మీనింజోకాఖల్ వ్యాక్సినేషన్ వేసుకున్న వారందకి వారి హజ్ యాత్ర పుస్తకం నందు వ్యాక్సినేషన్ వేసినట్లుగా వైద్యధికారిచే ధ్రువీకరించబడును. అని తెలియయపరిచినారు ఈ కార్యక్రములో మునిసిపల్ చైర్మన్ గంగాడ సుజాత హుడా చెర్మన్ రియాజ్ హజ్ స్టేట్ చైర్మన్ హుస్సేన్ మరియు డాక్టర్ టి. వెంకటేశ్వర్లు జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాది , డాక్టర్ కమలశ్రీ వ్యాధి నిరోధిక టీకాల అధికారి. డాక్టర్ మాణిక్యరావు సర్వజన సూపరింటెండెంట్ . డాక్టర్ మాధవీలత ఆర్.యమ్ఓ. డాక్టర్ హకీమ్ . డాక్టర్ హన్నా కీర్తన . డాక్టర్ హేమలత .డాక్టర్ సంతోష్ సర్వజ ఆసుపత్రి సిబ్బంది మరియు పి. పి. యూనిట్ సిబ్బంది పాల్గొన్నారు .



# నవోదయలో ప్రేరణ ఉత్సవ్




**రాయల్ జర్నలిజం ( ఒంగోలు) ఫిబ్రవరి 9:**
ఒంగోలు జవహర్ నవోదయ విద్యాలయంలో జిల్లా స్థాయిలో ప్రేరణ ఉత్సవ్ కార్యక్రమమును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న వివిధ పాఠశాలల విద్యార్థులు 50 మంది పాల్గొన్నారు, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు నవోదయ ప్రిన్సిపాల్ సి. శివరాం, కేంద్రియ విద్యాలయ ప్రిన్సిపాల్ యం. మనిష్ కుమార్ లు పాల్గొన్నారు, ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి విద్యాలయ ప్రిన్సిపాల్ సి.శివరామ్ మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకత, కళలు,నాయకత్వ లక్షణాలు, సంస్కృతి, వారసత్వం లక్షణాలను పెంపొందించుకోవాలని అన్నారు. ప్రేరణ ఉత్సవ్ లో భాగంగా కళ లు, చిత్రలేఖనం, వ్యాసరచన, గానకచేరీలు పోటీలను నిర్వహించారని, ఈ కార్యక్రమానికి ప్రకాశం జిల్లా వ్యాప్తంగా ఉన్న వివిధ పాఠశాలల నుంచి 50 మంది విద్యార్థులు పాల్గొన్నారని ప్రిన్సిపల్ శివరాం తెలిపారు ఇందులో 30 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు, మన ప్రియతమ దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడి నేతృత్వంలో న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 2020 ప్రకారం నేర్చుకోవడానికి అధిక ప్రాముఖ్యతను ఇచ్చారని, ఈ ప్రేరణ ఉత్సవంలో ఒక బాలుడిని మరియు ఒక బాలికను ఎంపిక చేయడం జరుగుతుందని ప్రకాశం జిల్లా స్థాయిలో మొత్తం 30 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని విద్యాలయ ప్రిన్సిపాల్ సి.శివరాం తెలిపారు అందులో 15 మంది బాలురని, 15 మంది బాలికలను ఎంపిక చేశారని ఆయన తెలిపారు ఈ ప్రేరణ ఉత్సవంలో వివిధ పాఠశాల చెందిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారని తెలిపారు..

రాయల్ జర్నలిజం
ROYAL JOURNALISM

# వెట్టి చాకిరీ రహిత బాపట్ల జిల్లాగా తీర్చిదిద్దుదాం



రాయల్ జర్నలిజం (బాపట్ల),ఫిబ్రవరి 09 : వెట్టి చాకిరీ రహిత బాపట్ల జిల్లా చేయవలసిన బాధ్యత మనందరి పై ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టరేట్ నందు వేట్టి చాకిరి నిర్మూలన చట్టం అమల్లోకి వచ్చి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా జిల్లా బాండెడ్ లేబర్ విజిలన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ కార్మిక శాఖ షాడోస్ డి బి ఆర్ సి ఎస్ఎఫ్ఐ ఆర్ డి స్వచ్ఛంద సేవా సంస్థలు ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెట్టి చాకిరీ రహిత బాపట్ల జిల్లా చేయవలసిన బాధ్యత మనందరి పై ఉందని తెలిపారు. వేట్టి చాకిరి ఒక అమానుష సామాజిక దురాచారమని, దీనిని నిర్మూలించేందుకు కేంద్ర ప్రభుత్వం 1976లో వేట్టి చాకిరి నిర్మూలన చట్టాన్ని అమల్లోకి తీసుకువచ్చిందని తెలిపారు. చట్టం అమలులోకి వచ్చి ఐదు దశాబ్దాలు గడిచాయని ఈ సందర్భంగా బాపట్ల జిల్లాను వెట్టిచాకిరి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు ప్రతిన పునాలనీ పిలుపునిచ్చారు. జిల్లా కార్మిక శాఖ ఏసీఎల్ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రతి పౌరుడు గౌరవంగా, స్వేచ్ఛతో జీవించే హక్కు రాజ్యాంగం కల్పించిందని, వేట్టి చాకిరి చట్టవిరుద్ధమే కాకుండా మానవ హక్కుల ఉల్లంఘన అని స్పష్టం చేశారు. ఇలాంటి ఘటనలు ఎక్కడైనా వెలుగుచూస్తే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు.వేట్టి చాకిరి నిర్మూలనకు ప్రభుత్వ శాఖలతో పాటు స్వచ్ఛంద సంస్థలు, పౌర సమాజం సమిష్టిగా పనిచేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, షాడోస్ ప్రతినిధులు రాజా సల్మాన్ , భాగ్య లక్ష్మీ , అలేఖ్య డి బి ఆర్ సి ప్రతినిధులు శ్రీలత , భగవాన్ దాస్, ఎస్ఎఫ్ఐ ఆర్ డి ప్రతినిధులు కిశోర్ , తిరపతి రావు సుజని మరియు వెట్టి విమోచన కొలేషన్ తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజల పొట్ట కొట్టే కొత్త ఉపాధి హామీ పథకం సవరించాలి

## సిపిఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ




రాయల్ జర్నలిజం బాపట్ల ఫిబ్రవరి 09:
పేద ప్రజల పొట్ట కొట్టే కొత్త ఉపాధి హామీ పథకం సవరించాలి అని సిపిఐ బాపట్ల జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టం పేరు మార్పును, కేంద్ర ప్రభుత్వం 90 శాతం నుండి 60 శాతం వరకు నిధులు తగ్గించటాన్ని, 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజుకి 700 రూపాయలు వేతనం ఇవ్వాలని, వ్యవసాయ పనులు ఉన్నప్పుడు ఉపాధి పనులను వద్దు అనడాన్ని, గ్రామీణ ఉపాధి హామీ కూలీలు పై పొమ్మనకొండ పొగ బెట్టే కేంద్ర ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ తదితర డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని ఏపీఓ కార్యాలయ వద్ద జరిగే నిరసన కార్యక్రమలలో భాగంగా బాపట్ల ఏ పీ ఓ కార్యాలయం వద్ద సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి మావిడిబత్తుల అశోక్, ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కే ఎలమంద నరసింహ మల్లేశ్వరరావు ఎలుక కొండలు,సాంబయ్య, కొండల్ రెడ్డి, వెంకటేశ్వర్లు, శాంసన్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధిలో బాపట్ల జిల్లా రాష్ట్రంలో నే మొదటి మూడు స్థానంలో ఉండేలా అధికారులు పనిచేయాలి

**రాయల్ జర్నలిజం (బాపట్ల), ఫిబ్రవరి 09 :** అమరావతి సచివాలయము నందు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రులు, కార్యదర్శులు సదస్సు లో జి ఎస్ డి పి (+ూణా) వృద్ధిరేటు, స్వర్ణాంధ్ర-2047 విజన్, పది సూత్రాలపై చర్చ - ఆదాయార్జన శాఖలు, కేంద్ర ప్రాయోజిత పథకాలు, పీపీపీ ప్రాజెక్టుల పురోగతి పై సమీక్ష - సమావేశం వర్చువల్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా అధికారులతో నిర్వహిస్తున్న సమావేశానికి అనంతరం బాపట్ల జిల్లా కలెక్టరేట్ లోని న్యూ వీడియో కాన్ఫరెన్స్ హల్ నందు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ వివిధ శాఖల అధికారులతో మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి అభివృద్ధి లో బాపట్ల జిల్లా మొదటి మూడు స్థానంలో ఉండేలా అధికారులు పనిచేయాలని అధికారులకు చూచించారు. అధికారులు సమిష్టిగా కృషి చేస్తే లక్ష్యాలు సాధ్యమవుతాయన్నారు.రాష్ట్ర స్థాయి ర్యాంకింగ్‌లో గతంలో 13వ స్థానంలో నుంచి అన్ని శాఖల అధికారుల సమన్వయ కృషి ఫలితంగా 10 లోపు




రావడం జరిగిందని, రాబోయే రోజుల్లో కూడా అధికారులు అందరు సమన్వయంతో పని చేసి జిల్లాను అన్ని రంగాలలో అభివృద్ధి సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో ఉండేలా అధికారులు సమిష్టిగా కృషి చేస్తే లక్ష్యాలు సాధ్యమవుతాయిని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్, జాయింట్ కలెక్టర్ భావన, డి ఆర్ ఓ.జి.గంగధర్ గౌడ్, సిపిఓ.ఏ.ఎస్.రాజు,డి యం ఎ హెచ్ ఓ.డాక్టర్ ఎస్.విజయమ్మ, డి ఈ ఓ.శ్రీనివాస్, డిఆర్డీఏ,స్త్రీ శిశు సంక్షేమ, డ్వామా,గృహ నిర్మాణ సంస్థ, సింగయ్య, రాధమాదవి,విజయలక్ష్మి, వెంకటేశ్వరరావు, గ్రామీణ నీటి సరాఫరా ఎస్ ఈ.అనంత రాజు, పశుసంవర్ధక శాఖ అధికారి, జె డి.వేణుగోపాల్, పంచాయతీ రాజ్ ఎస్ ఈ రాజన్ బాబు,బి సి సంక్షేమ శాఖ డి డి శివలీలా, సివిల్ సప్లైస్ డి యం.శ్రీలక్ష్మి,డి సి హెచ్ ఎస్ పద్మావతి, డి ఎఫ్ ఓ.రవి శంకర్, జిల్లా వ్యవసాయ అధికారిణీ విజయ నిర్మల, మార్క్ ఫెడ ఏ డి.కారుణశ్రీ, డి ఐ సి,జి యం,రామకృష్ణ, గిరిజన సంక్షేమ శాఖ అధికారి అబ్బులు, డి టి ఓ టి.పరందామరెడ్డి, డిప్యూటీ కలెక్టర్ లవన్న,డి యల్ డి ఓ.విజయలక్ష్మి,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ వాడండి ప్రాణాలను కాపాడుకోండి



రాయల్ జర్నలిజం (కర్లపాలెం), ఫిబ్రవరి 09: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం వలన అది ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడుతుందని కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇనకొల్లు పోలీసు రావు అన్నారు. సోమవారం కర్లపాలెం స్థానిక రహదారి పై రెడ్ క్రాస్ వారు హెల్మెట్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేయు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసురావు మాట్లాడుతూ కర్లపాలెం మండల పరిధిలో ఎస్సై రవీంద్ర ఆధ్వర్యంలో నేరాలు తగ్గాయని, అలాగే ప్రమాదాలు కూడా తగ్గించటానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టుగా నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పరమానంద కుమార్ ,కోశాధికారి బుర్ల రాజేష్,సభ్యులు బి. విజయకుమార్. తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ప్రచారంతో కార్యకర్తల్లో జోష్

## కాంగ్రెస్ హామీలపైనే నేతల విమర్శలు: సుడిగాలి పర్యటనలతో ప్రచారం ముగింపు



హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీ కూడా ప్రచారంలో దూసుకుపోయింది. చివరి రోజు కెటిఆర్, హరీష్ రావులు పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ లక్ష్యంగా విమర్శలు సంధించారు. ఇచ్చిన హామీలు తుంగలో తొక్కారని విమర్శించారు. ఇప్పటికే వార్డులు, డివిజన్ల అభ్యర్థులు సహా బీఆర్ఎస్ ముఖ్య నేతల నుంచి గల్లీ నాయకుల వరకు ప్రచార క్యాంపెయిన్‌లో మునిగిపోయారు.గత పదేండ్లలో బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో సుడిగాలి పర్యటనలు చేపట్టారు. నిత్యం ఐదు లేదా ఆరు మున్సిపాలిటీలను చుట్టేసారు. ఓటర్లతో మమేకమై గులాబీ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కేటీఆర్ ఇప్పటికే రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లో పర్యటించారు. ఆదివారం తాండూరు, ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల పరిధిలోని కాంగ్రెస్ చేసిన మోసాలను బహిరంగసభా వేదికలపై ఎండగట్టారు. ఆరు గ్యారెంటీల పేరిట వంచించిన తీరును వివరిస్తూ ముందుకెళ్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందాలను ఎండగడుతున్నారు. మరోవైపు హరీశ్‌రావు వారం రోజులుగా అలుపెరగకుండా ప్రచారం చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ పరిధిలోని సిద్దిపేట, గజ్వేల్, మెదక్, ఉమ్మడి రంగారెడ్డి, ఆదిలాబాద్ జిల్లాల్లోని మున్సిపాలిటీల్లో పర్యటించారు. కాంగ్రెస్ రెండేండ్ల పాలన కుంభకోణాలకు నిలయంగా మారిందని ఆరోపణాస్త్రాలు సంధించారు. బీజేపీ తెలంగాణకు చేస్తున్న ద్రోహాన్ని ప్రజలకు విడమరిచి చెప్పారు. ఆదివారం పటాన్‌చెరువు, సదాశివపేట, జహీరాబాద్, సంగారెడ్డి, ఇంద్రేశం మున్సిపాలిటీల్లో ప్రచారం సాగించారు. ప్రచారంలో భాగంగా హరీశ్‌రావు సం గారెడ్డి జిల్లాలో ఆదివారం ఒకేరోజూ 15 కార్న ర్ మీటింగ్‌లో పాల్గొని రికార్డు సృష్టించారు. బీఆర్ఎస్ పార్టీ నేతల ప్రచారానికి విశేష స్పందన లభిస్తున్నది. కేటీఆర్, హరీశ్‌రావు నిర్వహించిన సభలు, సమావేశాలకు పెద్దసంఖ్యలో జనం కదిలివచ్చారు. వారి ప్రసంగాలను ఆసక్తిగా వినడం కనిపించింది. కాంగ్రెస్, బీజేపీ నేతలపై విసిరిన పంచ్‌లకు ఈలలు, చప్పట్లతో ప్రతిస్పందనలు మార్మోగాయి. కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి దుర్భాషలాడుడిన తీరుపై ప్రజలు పిడికి÷-లలెత్తి ఆగ్రహాన్ని ప్రదర్శించారు. కాంగ్రెస్‌కు ఓటుతోనే బుద్ధిచెప్తామని హెచ్చరించారు. కేటీఆర్, హరీశ్‌రావు, మాజీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, మున్సిపల్ పార్టీ ఇన్‌చార్జిల ప్రచారజోరుతో అభ్యర్థులు సంతోషంగా ఉన్నారు. విజయం సాధిస్తామని ధీమా కనబరుస్తున్నారు. క్యాడర్‌లో సైతం ఉత్సా హం తొణికిసలాడుతున్నది. పార్టీ అభ్యర్థుల విజయానికి రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తున్నారు.

# రెండేళ్ల పాలనలో కాంగ్రెస్ చేసింది శూన్యం



సిద్దిపేట,: రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి శూన్యమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే విమర్శించారు. 420 హామీలు ఇచ్చి ఒక్క హామీని అమలు చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. మెదక్ రావాలంటే రేవంత్ రెడ్డికి భయం పట్టుకుందని హరీశ్‌రావు అన్నారు. అన్ని జిల్లాలు తిరుగుతున్న రేవంత్ రెడ్డి ఉమ్మడి మెదక్‌కు వచ్చేందుకు ముఖం లేదని విమర్శించారు.ఇక్కడ హరీశ్‌రావు ఉన్నాడని భయపడుతున్నాడని తెలిపారు. మహిళలకు ఫ్రీ బస్సు ఇచ్చారు.. కానీ రేవంత్ పాలన అంత తుస్సే అని అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీలో హరీశ్‌రావు పర్యటించారు. చెల్లాపూర్ వార్డులో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. తెలంగాణను తెచ్చిన కేసీఆర్‌ను రేవంత్ తిడుతున్నాడని హరీశ్‌రావు మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రం తెచ్చి అభివృద్ధి పథకాలు అమలు చేయడం కేసీఆర్ తప్పా అని ఆయన ప్రశ్నించారు. కేసీఆర్‌ను తిడితే ఓట్లు రావని.. పథకాలు అమలు చేస్తే వస్తాయని హితవుపలికారు. బూతులు మాట్లాడే రేవంత్‌కు పోలింగ్ బూత్‌లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. పంద్రాగస్టుకల్లా రుణమాఫీ పూర్తి చేస్తానని దేవుళ్లపై రేవంత్ రెడ్డి ఒట్లు పెట్టిండని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, గ్యారంటీలు, గారడీలపై మెదక్ ప్రజలు నిలదీస్తారని ఇటువైపు చూడటం లేదని పేర్కొన్నారు. మెదక్‌లో రేవంత్ రెడ్డి ఒక్క వార్డులో కూడా గెలవడని తెలిపారు. రేవంత్ రెడ్డి జాబ్ క్యాలెండర్ లేదు కానీ.. స్కామ్ క్యాలెండర్ అయితే ఇచ్చిండని విమర్శించారు. ప్రతి నెల ఏదో ఒక కుంభకోణం తెరపైకి తీసుకొచ్చాడని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో రేవంత్ రెడ్డికి సురుకుపెట్టాలని అన్నారు. దుబ్బాక ఓటర్ల దెబ్బకు రేవంత్ రెడ్డికి దిమ్మ తిరగాలని అన్నారు. అలా కాకుండా కాంగ్రెస్‌కే ఓటేస్తే.. పథకాలు ఎగబెట్టినా నాకే ఓట్లు వేశారని రేవంత్ రెడ్డి అంటారని తెలిపారు. దుబ్బాకలో కాంగ్రెస్ ఏదైనా అభివృద్ధి చేస్తే చూపించాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో డబ్బులు పంచి గెలవాలని రేవంత్ రెడ్డి అనుకుంటున్నాడని తెలిపారు. కేసీఆర్ ఇచ్చిన పథకాలు, అభివృద్ధితో పోలిస్తే ఈ డబ్బులు ఎంత అని ప్రశ్నించారు. దుబ్బాకలో బడి కట్టింది.. గుడి కట్టింది.. ఆస్పత్రి కట్టింది కేసీఆర్ అని గుర్తుచేశారు. రెండేళ్లలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. దుబ్బాకను ఇంకా అభివృద్ధి చేసే బాధ్యత తమదేనని హామీ ఇచ్చారు. ఆరు గ్యారంటీలు అమలు కావాలంటే రేవంత్ రెడ్డికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి నోరు విప్పితే బూతులు తప్ప మంచిమాట రాదని అన్నారు. కేసీఆర్ హయాంలో భూముల విలువ పెరిగిందని హరీశ్‌రావు తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక భూముల ధరలు తగ్గడమే కాదు.. తెలంగాణ ప్రతిష్ట కూడా దిగజారిందని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి చేతిలో మోసపోని మనిషే లేదని పేర్కొన్నారు. హామీలు, గ్యారంటీల పేరుతో మోసం చేసి కాంగ్రెస్ నాయకులు అధికారంలోకి వచ్చారని విమర్శించారు. తెలంగాణ భవిష్యత్ గురించి ఆలోచించి ఓటేయాలని పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డికి చురుకు తగిలితేనే పథకాలు అమలవుతాయని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధికి కారు గుర్తుపై ఓటేసి గెలిపించాలని పిలుపునిచ్చారు.



# రాష్ట్రంలో పెరిగిన అత్యాచారాలు ,హత్యలు


మహబూబ్‌నగర్:రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దారుణాలు పెరిగిపోయాయని బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ ధ్వజమెత్తారు. మున్సిపల్ ఎన్నికల తర్వాత ట్యాక్స్‌లు పెంచేందుకు రేవంత్ రెడ్డి సర్కార్ సిద్ధమవుతోందని ఆరోపించారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డిపై ఎంపీ డీకే అరుణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఖజానాలో చిల్లిగవ్వ లేదని చూపిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రజలను మరోసారి మోసం చేసేందుకు సిద్ధమవుతోందని విమర్శించారు.మహబూబ్‌నగర్ పార్లమెంట్ నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నానని అరుణ తెలిపారు. అన్ని మున్సిపాలిటీల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ హైకమాండ్ ఆదేశాల మేరకు ప్రచారం నిర్వహించానని చెప్పుకొచ్చారు. మహబూబ్‌నగర్ కార్పొరేషన్, భూత్‌పూర్, జడ్చర్ల మున్సిపాలిటీల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వ నిధులు అవసరముందని ఎంపీ అన్నారు.మహబూబ్‌నగర్ చుట్టుపక్కల గ్రామాలు విలీన గ్రామాలుగా కలిశాయని ఎంపీ అరుణ వివరించారు. కార్పొరేషన్ అభివృద్ధి కోసం మాస్టర్ ఎ÷-లాన్ కూడా అవసరం ఉందని చెప్పుకొచ్చారు. పట్టణాల్లో స్లమ్ ఏరియాలపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ అభ్యర్థులు ఎన్నికల్లో గెలవగానే సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేస్తామని తెలిపారు. అవినీతి రహిత, పారదర్శకమైన పాలన అందించడమే బీజేపీ లక్ష్యమని ఉద్ఘాటించారు. ప్రతి వార్డులో డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ తదితర అంశాలపై దృష్టి సారించి.. కేంద్ర ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. బీజేపీ మేనిఫెస్టోను ప్రజలకు అనుకూలంగా తయారుచేసి, అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని డీకే అరుణ పేర్కొన్నారు.

# సర్పంచులకు కొత్త అధికారాలు.. ఇక నుంచి వారికే తనిఖీ బాధ్యతలు





హైదరాబాద్:తెలంగాణలో పల్లెల్లో కొలువుదీరిన కొత్త సర్పంచ్‌లకు కొత్త అధికారాలు కట్టబెడుతూ రేవంత్ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి గ్రామాల్లోని అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేసే అధికారాలను సర్పంచ్‌లకు అప్పగించారు. ప్రత్యేకంగా కమిటీ ఏర్పాటు చేయనుండగా.. ఈ కమిటీకి సర్పంచ్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. పిల్లలు, బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటారు.తెలంగాణలోని గ్రామ పంచాయతీల్లో కొత్త పాలకవర్గాలు కొలువుదీరిన విషయం తెలిసిందే. గత రెండు నెలల క్రితం సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరగ్గా.. వారు బాధ్యతలు కూడా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సర్పంచ్‌లకు కొత్త అధికారాలు అప్పగిస్తూ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి అంగన్‌వాడీ కేంద్రాలను సర్పంచులే పర్యవేక్షించనున్నారు. ఈమేరకు ప్రభుత్వం వారికి అధికారాలను కట్టబెట్టనుంది. చిన్న పిల్లలు, గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీలో ఎలాంటి అక్రమాలు జరగకుండా.. అంగన్వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం గతంలో పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేసింది.అయితే పంచాయతీ పాలకవర్గాల కాలపరిమితి ముగిసిన తర్వాత రెండేళ్ల పాటు సర్పంచులు లేకుండా గ్రామ పంచాయతీలు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఇవన్నీ నామమాత్రంగానే మారాయి. చాలా గ్రామాల్లో సక్రమ పర్యవేక్షణ లేక అంగన్వాడీ కేంద్రాల్లో అక్రమాలు జరిగాయి. పౌష్టికాహారం పక్కదారి పట్టిందని గుర్తించిన ప్రభుత్వం కొత్త కమిటీల ఏర్పాటుపై తాజాగా దృష్టి సారించింది. గ్రామ పంచాయతీల పాలకవర్గాలు కొలువుదీరడంతో నూతన కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. సర్పంచ్‌లకే తనిఖీ బాధ్యతలు అప్పగిస్తున్నారు.ప్రభుత్వం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న సరకులు ప్రతినెలా వచ్చేలా సర్పంచ్ నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ పర్యవేక్షిస్తుంది. ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలిస్తారు. ఆరోగ్యలక్ష్మి పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు అందించే భోజనం నాణ్యతను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తారు. పిల్లలు, గర్భిణులతో పాటు కేంద్రాలకు వచ్చే వారికి ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ప్రతి నెలా రూ.లక్షల విలువైన బాలామృతం, బియ్యం, కందిపప్పు, పాలు, గుడ్లు తదితర పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను లబ్ధిదారులకు అందేలా చూస్తారు.అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ కమిటీకి సర్పంచి ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. ఇందులో మట్నత్తం 11 మంది సభ్యులుంటారు. కన్వీనరుగా అంగన్‌వాడీ ఉపాధ్యాయిని ఉండనుండగా.. గ్రామంలోని స్కూల్‌లో సైన్స్ బోధించే ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు, ఓ రిటైర్డ్ ఉద్యోగి, ఏఎన్‌ఎం, చిన్నారుల తల్లులు ఇతర సభ్యులుగా ఉంటారు. వీరు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ పౌష్టికాహారం అందేలా చూస్తారు.

# రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్లకు బహిరంగ వేలం..



హైదరాబాద్: హైదరాబాద్ శివారు తొర్రూరులో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వం ఓపెన్ ప్లాట్లు వేలం వేసింది. ఈ వేలంలో మట్నత్తం 105 ప్లాట్లు ఉండగా.. వాటిని దక్కించుకునేందుకు పలువురు పోటీపడ్డారు. గరిష్ఠంగా చదరపు గజం రూ.45 వేలు పలికినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వానికి రూ.56 కోట్ల మేర ఆదాయం సమకూరింది.హైదరాబాద్ శివారులో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ మరోసారి ఓపెన్ ప్లాట్లు వేలం వేసింది. ఈ వేలంలో గరిష్ఠంగా చదరపు గజం రూ.45వేలు పలికింది. ఔటర్ రింగు రోడ్డు, విమానాశ్రయం సమీపంలోని రంగారెడ్డి జిల్లా తొర్రూర్ ప్రాంతంలోని 105 ప్లాట్ల బహిరంగ వేలం ప్రక్రియ శనివారం జరగ్గా.. ఈ వేలంలో కొనుగోలుదారులు భారీగా పాల్గొన్నారు. బాటసింగారం ప్రాంతంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో రెండు రోజుల పాటు కొనసాగనున్న ఈ వేలంలో తొలిరోజు మట్నత్తం 70 ప్లాట్లను విక్రయించారు. తొర్రూర్‌తో పాటు ఓఆర్ఆర్ సమీపంలోని కుర్మల్‌గూడ, బహదూర్‌పల్లి ప్రాంతాల్లోని ఓపెన్ ప్లాట్లను సైతం బహిరంగా వేలం ద్వారా విక్రయించడానికి రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ గతనెలలో నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. శనివారం విక్రయించిన భూముల ద్వారా ప్రభుత్వానికి సుమారు రూ.56 కోట్ల మేర ఆదాయం సమకూరి నట్లు హౌసింగ్‌బోర్డు ఎండీ వీపీ గౌతం తెలిపారు.బహిరంగ వేలంలో చాలామంది కుటుంబ సమేతంగా హాజరై ఓపెన్ ప్లాట్ కొనుగోలుకు పోటీప డ్డారు. ఓ కార్నర్ ప్లాట్‌ను దక్కించుకోవడానికి వేలంలో 20 సార్లకు పైగా ధరలు పెంచుతూ పలువురు పోటీపడ్డారు. 200 నుంచి 300 చదరపు అడుగుల విస్తీర్ణంలోని ఈ ప్లాట్ల చదరపు గజం కనీస ధర రూ.25వేలు నిర్ణయించారు. కొన్ని ఓపెన్ ప్లాట్లను రూ.45వేలు, రూ.43వేలు, రూ.41వేలకు కూడా పలువురు కొనుగోలు చేశారు. మొత్తంగా ఇక్కడ వేలం వేసిన భూములు సగటున చదరపు గజానికి రూ.31వేలకు అమ్ముడుపోయాయని అధికారులు తెలిపారు. రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ చీఫ్ ఇంజినీర్, ఈఈ, స్థానిక రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో ఈ వేలం పాటను విజయవంతంగా నిర్వహించారు.తొర్రూర్‌లోని మిగతా 35 ఓపెన్ ప్లాట్లకు, బహదూర్‌పల్లి, కుర్మల్‌గూడలోని మరో 32 ఓపెన్ ప్లాట్లకు నేడు బహిరంగ వేలం నిర్వహించారు. అందుకు సంబంధించిన వివరా లు రేపు వెల్లడికానున్నాయి. కాగా, ప్రభుత్వం వేలం వేస్తున్న ఈ ప్లాట్లను దక్కించుకునేందుకు పలువురు ఆసక్తి చూపిస్తున్నారు. ఎలాంటి వివాదాల్లేకుండా, క్లియర్ టైటిల్స్ ఉండటంతో సర్కార్ ప్లాట్లును దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు.

# యాక్సిడెంట్ బాధితులను కాపాడితే రూ.25 వేల బహుమతి: తెలంగాణ రవాణా శాఖ



హైదరాబాద్:తెలంగాణ రవాణా శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. కేంద్రం ప్రవేశపెట్టిన రహ వీర్ పథకాన్ని తెలంగాణలోనూ అమలు చేయాలని డిసైడ్ అయింది. ఈ పథకం కింద యాక్సిడెంట్ బాధితులకు సాయం చేసిన వారికి నగదు బహుమతి అందించనున్నారు. సామాజిక బాధ్యతగా వారి ప్రాణాలు కాపాడిన వారికి రూ.25 వేల నగదు, ప్రశంసాపత్రం అందించనున్నారు.తెలంగాణలో రోడ్లు నెత్తురోడుతున్నాయి. ప్రతి నిత్యం వందల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా.. పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోతున్నారు. చాలా సందర్భాల్లో సకాలంలో క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకెళ్లకపోవటం వల్లే ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో రోడ్డు ప్రమాదాల్లో గాయపడ్డ బాధితులను కాపాడి.. ఆసుపత్రికి చేర్పించిన వారికి నగదు బహుమతి ఇవ్వాలని తెలంగాణ రవాణాశాఖ యోచిస్తోంది.సహాయం చేసే వారికి రూ.25 వేల నగదు బహుమతి అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'రహ వీర్' పథకాన్ని రాష్ట్రంలోనూ సమర్థంగా అమలు చేస్తామని తెలంగాణ రవాణా శాఖ వెల్లడించింది. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే భయపడకుండా బాధితులను హాస్పిటల్ తరలించే పౌరులను గౌరవిస్తామని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. వారికి రవాణా శాఖ ద్వారా రూ.25 వేల నగదు బహుమతితో పాటు ప్రశంసా పత్రం కూడా అందిస్తామని చెబుతున్నారు. ప్రమాదం జరిగినప్పుడు ముందుకు వచ్చి సహాయం చేయాలని ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.కాగా, యాక్సిడెంట్ జరిగిన వెంటనే వారిని ఆసుపత్రులకు తరలిస్తే ప్రాణాలు నిలబెట్టొచ్చని వైద్యులు చెబుతున్నారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి గంట సమయాన్ని గోల్డెన్ అవర్ అంటారని.. ఈ సమయంలో కనుక క్షతగాత్రులను ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించగలిగితే ప్రాణాలు ఎలాంటి ముప్పు ఉండదని అంటున్నారు. అయితే రోడ్లపై యాక్సిడెంట్లు జరిగి క్షతగాత్రులు నెత్తుటి మడుగులో పడి ఉన్నా.. చాలా మంది వారికి సహాయం చేసేందుకు ముందుకు రావటం లేదు. పోలీస్ కేసుల భయంతో పాటు మనకెందుకులే అనే ధోరణి చాలా మందిలో పెరిగింది.ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రహ వీర్ పథకాన్ని ప్రవేశపెట్టింది. సామాజిక బాధ్యతగా.. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను కాపాడితే నగదు బహుమతిని అందిస్తోంది. రవాణా శాఖ ద్వారా రూ. 25 వేల ఆర్థిక సాయం ఇస్తోంది. ఇప్పటి వరకు తెలంగాణలో ఈ పథకం అమల్లో లేదు. తాజాగా రవాణాశాఖ అధికారులు తెలంగాణలో సైతం ఈ పథకాన్ని అమలు చేస్తామని వెల్లడించారు.

# మున్సిపల్ ఎన్నికల పుణ్యం.. అక్కడ ఏ ఇంట్లో చూసినా కొత్త టీవీలు, ఫ్రిజ్‌లు


హైదరాబాద్:తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారం నేటితో ముగియనుంది. నేడు సాయంత్రం 5 గంటల తర్వాత మైకులు మూగబోనున్నాయి. ఇప్పటి వరకు రాష్ట్రస్థాయి నేతలు, మంత్రులు, ఎమ్మెల్యేలతో ప్రచారం నిర్వహించిన అభ్యర్థులు ఇక రాత్రి పూట ప్రచారానికి సిద్ధమవుతున్నారు. ఓటర్లను బుట్టలో వేసుకునేందుకు అడిగిందల్లా ఇస్తున్నారు. తాజాగా ఓ మున్సిపాలిటీలో ఏ ఇంట్లో చూసినా కొత్త టీవీలు, ఫ్రిజ్‌లే దర్శనమిస్తున్నాయి.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రధాన పార్టీలు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు దుకుడుగా ప్రచారం చేస్తున్నారు. గెలుపే లక్ష్యంగా తమ వ్యూహాలకు పదునుపెడు తున్నారు. ఫిబ్రవరి 11న రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో ఎన్నికలు జరగనుండగా నేడు సాయంత్రంతో ప్రచార పర్వం ముగియనుంది. దీంతో అభ్యర్థులు 'అసలు' ప్రచారం.. అంటే తాయిలాల పంపిణీకి సిద్ధమవుతున్నారు. ఇప్పటికే పలు మున్సిపాలిటీల్లో పంపిణీ షురూ అయింది.ఉదయం వేళల్లో మంది మార్బలం, పార్టీ నేతలు, కార్యకర్తలతో గుంపుగా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థులు.. రాత్రి కాగానే.. ఒకరిద్దరు సన్నిహితులను వెంటబెట్టుకుని ప్రతి గడపకు వెళు_న్నారు. ఓటర్ల కాళ్లు, వేళ్లూ మొక్కుతూ.. వారికి కావాల్సిన నజరానాలిచ్చి ప్రమాణాలు చేయించుకుంటున్నారు. రంగారెడ్డి



జిల్లా చేవెళ్ల, ఆమనగల్లు, ఇబ్రహీంపట్నం, మొయినాబాద్, శంకరపల్లి, షాద్‌నగర్ మున్సిపాలిటీలకు, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో అలియాబాద్, ఎల్లంపేట్, మూడు చింతలపల్లి, సంగారెడ్డి జిల్లా ఇంద్రేశం, ఇస్నాపూర్ మున్సిపాలిటీల్లో రియల్ ఎస్టేట్ జోరుగా సాగుతుంది. దీంతో ఇక్కడ పోటీ చేసే అభ్యర్థులు ఖర్చుకు ఏమాత్రం వెనకాడటం లేదు.మొయినాబాద్ మున్సిపాలిటీలో ఓ వార్డు అభ్యర్థి.. నలుగురు ఓటర్లున్న కుటుంబాన్ని రాత్రి పూట ఓటు అడిగేందుకు వెళ్లగా వారింట్లో పాత టీవీ కనిపించింది. దీంతో వెంటనే అనుచరులకు చెప్పి కొత్త టీవీ ఏర్పాటు చేయించారు. ఈ విషయం తెలిసిన ప్రత్యర్థి.. కొత్త ఫ్రిజ్‌తో ఆ ఇంటికి వెళ్లారు. నాలుగు ఓట్లు ఉన్న ఇంట్లో మరో రెండు ఓట్లు తనకు వేయాలని ఒట్టు పెట్టించుకున్నారు. మొయినాబాద్‌లోని సురంగల్‌లో ఏ ఇంట్లో చూసినా కొత్త టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మెషిన్లే దర్శనమిస్తున్నాయి.ఇక శంకరపల్లి మున్సిపాలిటీలో అభ్యర్థులు అప్పటికప్పుడు టోకెన్ అమౌంట్‌గా రూ.5 వేల చొప్పున పంపిణీ చేశారు. మళ్లీ వచ్చి మరికొంత నగదు ఇస్తామని భరోసా ఇచ్చి ఓటర్లచేత ప్రమాణం తీసుకున్నారు. శంకరపల్లి మున్సిపాలిటీ జనరల్‌కు రిజర్వు కాగా.. అక్కడ గెలిస్తే తానే ఛైర్మన్ అని భావించే ఓ అభ్యర్థి మహిళలకు చీరెలు, మిక్సీలతో పాటు నగదు పంచిపెడుతున్నారు. ఓటర్లు కూడా తెలివిగా వ్యవహరిస్తున్నారు. అభ్యర్థులు ఓడిపోతే వాటిని తిరిగి ఇమ్మంటారనే భయం వారిని వెంటాడుతోంది. దీంతో ఓడిపోతే అలా అడగవద్దని కొందరు ఓటర్లు ముందుగా భరోసా తీసుకుంటున్నారు.ఏది ఏమైనా ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత శక్తివంతమైన ఆయుధం. అలాంటి ఆయుధాన్ని తాత్కాలిక ప్రయోజనాలకు అమ్ముకోవటం దారుణం. ఈ విషయంపై ఓటర్లు కూడా ఆలోచన చేసి మంచి చేసే వ్యక్తులను ప్రతినిధులుగా ఎన్నుకోవాలి.

# పేద రోగులకు వరం.. ఈ హస్పిటల్‌లో రోబోటిక్ విధానంలో ఫ్రీగా సర్జరీలు

హైదరాబాద్: క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పేద రోగులకు ఎంఎన్‌జే ఆసుపత్రిలో ఉచితంగా సర్జరీలు చేస్తున్నారు. రోబోటిక్ విధానంలో రోగులకు ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్సలు చేస్తున్నారు. గత రెండున్నరేళ్లలో ఆసుపత్రిలో రూ.12.5 కోట్ల విలువైన సర్జరీలు చేసినట్లు వైద్యులు వెల్లడించారు.పేద రోగులకు నిజంగా ఇది వరమనే చెప్పాలి. హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో పేద రోగులకు రోబోటిక్ విధానంలో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నారు. అవి కూడా ఉచితంగా. గడిచిన 30 నెలల వ్యవధిలో దాదాపు రూ.12.5 కోట్ల విలువైన రోబోటిక్ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సేవలను ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా పేద రోగులకు అందిస్తున్నారు. గత రెండున్నరేళ్లలో రికార్డు స్థాయిలో 250 వరకు రోబోటిక్ సర్జరీలు చేశారు. హైదరాబాద్ నగరం నుంచే కాకుండా ఇతర జిల్లాలు, సరిహద్దు రాష్ట్రాల నుంచి ప్రతి రోజూ 700-800 వరకు రోగులు క్యాన్సర్ చికిత్సల కోసం ఆసుపత్రిని ఆశ్రయిస్తుంటారు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా చాలామంది రోగులు వస్తుంటారు. సాధారణంగా ఒక రోబో సర్జరీకి ప్రైవేటు ఆసుపత్రిలో అయితే రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం ఎంఎన్‌జేకు ఒక్కో రోబో సర్జరీకి రూ.1.5 లక్షల వరకు చెల్లిస్తోంది.కిడ్నీ, పెద్దపేగు, గ్యాస్ట్రిక్, గర్భసంచి, అన్నవాహిక, ప్రొస్టేట్ క్యాన్సర్లకు గతంలో కోత పెట్టి క్యాన్సర్ గడ్డలను తొలగించే వారు. అయితే అతి చిన్న క్యాన్సర్ గడ్డలను తొలగించడానికి డాక్టర్లకు కొన్నిసార్లు సాధ్యమయ్యేది కాదు. అధిక రక్త స్రావంతో పేషెంట్లు ఎక్కువ రోజులు హాస్పిటల్స్‌లోనే ఉండాల్సి వచ్చేది. ప్రస్తుతం అత్యాధునిక సర్జికల్ రోబోతో అతి చిన్న కణతులను చాలా ఈజీగా తొలగిస్తున్నారు. ఎలాంటి కోత లేకుండానే.. నాలుగు రంధ్రాలతో రోబో చేతులు లోపలకు వెళ్లి క్యాన్సర్ గడ్డలను పూర్తిగా తొలగిస్తున్నాయి. డాక్టర్లకు చేతులు వణుకు సమస్య ఉంటే ఈ శస్త్రచికిత్సలు చాలా కష్టమయ్యేవి. ప్రస్తుతం రోబోలతో సర్జరీలు చేస్తుండటంతో ఆ పరిస్థితి లేదు. ఇన్‌ఫెక్షన్లకు ఆస్కారం కూడా చాలా తక్కువ. మహిళల్లో వచ్చే గర్భాశయ క్యాన్సర్‌కు రోబోటిక్ సహాయ శస్త్ర చికిత్స మంచి ఫలితాలు అందిస్తోంది.ఇక తెలంగాణలో వైద్యారోగ్యశాఖ బలోపేతానికి సర్కార్ కీలక చర్యలు



